నవరత్నాలతో 'సంక్షేమ' కాంతులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: నవరత్నాలు పేరిట రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం మండలంలోని ఆడవరం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో గ్రామస్తులు జై జగనన్న.. జై జోగులన్న.. జై విక్రాంత్ అన్న అని నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే ఆయన అభిమతమన్నారు. అందుకే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రాలు, నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు పరిస్థితి అలా లేదని, గమనించాలన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారం వ్యవధిలోనే పథకం అందుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చిన ఘనత ఒక్క సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎం.కృష్ణమూర్తి నాయుడు, ఎంపీటీసీ ఎ.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


జగనన్న అమ్మఒడి చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: రాష్ట్రంలో శతశాతం అక్షరాస్యతే లక్ష్యంగా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని పెరుమాళి గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాల ఆవరణలో జగనన్న అమ్మఒడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్మఒడి పథకం నాలుగో విడత నిధుల చెక్కును విడుదల చేసి, మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నాలుగేళ్లలో విద్యారంగం అభివృద్ధికి రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. జగనన్న అమ్మఒడి పథకం ద్వారా మండలంలోని 5,020 మంది విద్యార్థులకు సంబంధించి, వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.7.53 కోట్లు, ఈ నాలుగేళ్లలో ఇదే పథకం ద్వారా మండలానికి దాదాపు రూ.30 కోట్లను ప్రభుత్వం జమ చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మనబడి నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకం కింద పిల్లలకు రోజుకో మెనూతో పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. వీటితో పాటు జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా నగదు అందజేయడం జరుగుతోందన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదనే ఉద్దేశ్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాలన్నింటినీ అమలు చేస్తున్నారన్నారు. విద్యాసంవత్సరం ఆరంభంలోనే జగనన్న విద్యాకానుక కింద ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగు అందిస్తున్నారన్నారు. అలాగే ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ ప్రోత్సాహకాలతో విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని, విద్యార్థులు కూడా బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ జి.లూర్దు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.బాబ్జీరావు, ఎంఈఓ త్రినాధరావు, ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, పెరుమాళి, గోపాలవలస సర్పంచ్‌లు హేమలత, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన


నాడు-నేడు పనుల పరిశీలనలో ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: మండలంలోని కోనంగిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనబడి నాడు-నేడు పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. దాదాపు రూ.96.81 లక్షల వ్యయంతో ఈ పనులు జరుగుతుండగా, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు.

ఇంటర్వ్యూలకు 9 మంది హాజరు


వలంటీర్ అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ రవికుమార్

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్ల పోస్టుల భర్తీకి గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 9 మంది హాజరైనట్లు ఎంపీడీఓ జి.వి.రవికుమార్ తెలిపారు. మండలంలోని కృష్ణంవలస, గోళ్లవలస, జి.ఎస్.పురం, గరికిపాడు, మిర్తివలస గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఒక్కో వలంటీర్ పోస్టుతో పాటు బొద్దూరులో మరో మూడు వలంటీర్ పోస్టులకు మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారని, అయితే ముగ్గురు ఇంటర్వ్యూకు హాజరు కాలేదని పేర్కొన్నారు. ఎంపికైన వారికి త్వరలో నియామకపత్రాలు అందజేస్తామన్నారు.

నేడు ఇంటర్వ్యూ..

రాజాం: మండలంలోని కంచరాం, ఆగూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు సంబంధించి, శుక్రవారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కంచరాంలో రెండు పోస్టులు, ఆగూరులో ఒక పోస్టు ఖాళీగా ఉండగా, ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారని, ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభం

రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు సంబంధించి, రెండో బ్యాచ్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్లానల్ కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ శిక్షణను ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఇవ్వడం జరుగుతోందని, ఇక్కడ నేర్చుకునే బోధనలోని మెలకువల ద్వారా విద్యార్థుల్లో అభ్యసనంపై ఆసక్తి పెంచవచ్చన్నారు. విద్యాబోధన కూడా సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో ఫెసిలిటేటర్స్ కె.చంద్రునాయుడు, ప్రసాద్, ట్రైనర్స్ సతీష్, రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు


ఇందిరమ్మ కాలనీలో అక్రమ కట్టడాల గోడలు కూల్చివేసిన దృశ్యం

బొబ్బిలి: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని ఆక్రమణలను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. ఇక్కడి అక్రమ కట్టడాలపై పలువురు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడుకు ఫిర్యాదు చేయగా, వాటిని తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశారు. స్పందించిన అధికారులు గురువారం ప్రొక్లెయినర్‌తో నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఏర్పాటు

రాజాం: పీఆర్‌టీయూ(ప్రోగ్రెస్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) రాజాం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో యూనియన్ అధ్యక్షుడిగా కరణం బంగారునాయుడు, ప్రధాన కార్యదర్శిగా సింగిపురం కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీవీబీఎస్.రాజు, గౌరవాధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, బి.కూర్మారావు, ఎస్.ఉదయ్‌కుమార్, ఎస్.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత వైద్య శిబిరం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని వస్త్రపురి కాలనీలో ఈ నెల 8వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ సమక్షంలో రోగులకు బీపీ, సుగర్, ఫిట్స్, పక్షవాతం తదితర రోగాలకు సంబంధించిన తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోగులను కోరారు.

టీడీపీ నేతలకు అభివృద్ధి కనిపించడం లేదా?

- ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు


మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ నాలుగేళ్లలో మండలంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ఇవి టీడీపీ నేతలకు కనిపించడం లేదా అని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ప్రశ్నించారు. మండలంలోని కొంపంగి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జి.టి.పేట నుంచి ఆగూరు వెళ్లే దారిలో రూ.25 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వంతెన నిర్మాణం, కొంపంగి గ్రామంలో 250 మీటర్ల సీసీ రోడ్డు వేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఇద్దనవలస, పిట్టాడ, బడేవలస గ్రామాల్లో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. వీటితో పాటు గిరిజన గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు, లక్ష్మీపురం వంతెన నిర్మాణం బీటీ రోడ్డు, గుర్ల ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరామన్నారు. వచ్చే నెలలో కుంటినవలస గ్రామంలో రూ.550 కోట్ల వ్యయంతో గిరిజన వర్సిటీకి శంకుస్థాపన జరగనుందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, దీనికోసం ఆయన అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కేవలం ఉనికి కోసమే టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, లెంక రత్నాకర్‌నాయుడు, సారిక ఈశ్వరరావు, రాయిపిల్లి రామారావు, కనిమెరక త్రినాధరావు, మీసాల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయండి


సర్వే రికార్డులు పరిశీలిస్తున్న డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు

వంగర: గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలని డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే రికార్డులను పరిశీలించిన ఆయన ప్రస్తుతం సర్వే జరుగుతున్న ఆరు గ్రామాల్లో ఈ నెల 12వ తేదీ లోగా సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. రైతుల సమక్షంలో సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో రోడ్డు విస్తరణ పనులు


వరదనీటిని ప్రొక్లెయినర్‌తో తొలగిస్తున్న దృశ్యం

రాజాం: స్థానిక పట్టణంలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణంపై ఆరాతీయడంతో పాటు పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఇటీవల కురిసిన వర్షానికి ప్రధాన రహదారిపై అక్కడక్కడ నిల్వ ఉండిపోయిన వరదనీటిని ప్రొక్లెయినర్‌తో దిగువకు తరలించి, గోతులను తాత్కాలికంగా చదును చేసే పనులు చేశారు. కార్యక్రమంలో రాజాం పట్టణ హెల్త్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి సోదరులకు సాదరస్వాగతం పలుకుతున్న పిరిడి గ్రామస్తులు

బొబ్బిలి: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రశంసించారు. గురువారం మండలంలోని పిరిడి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయమని, ఆయన తన పాదయాత్ర నుంచి అధికారంలోకి వచ్చే ముందు వరకు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందిస్తున్న సంక్షేమ పథకాల తీరు దేశానికే ఆదర్శమన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి, సర్పంచ్ టి.వరలక్ష్మి, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బి.కాశినాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ టి.దామోదరరావు, ఏఎంసీ డైరెక్టర్లు ఆర్.గౌరి, ఎ.త్రినాధ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు


వాడాడలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యురాలు రాధిక


రాజాం సిటీ: పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ జయప్రకాష్

బాడంగి: వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా మండలంలోని బాడంగి, వాడాడ పశువైద్య కేంద్రాల్లో దాదాపు 35 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు గురువారం వేశారు. కుక్కల నుంచి మనుషులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా మూడు నెలల వయసు కలిగిన ప్రతీ జీవానికి టీకాలు వేసినట్లు వైద్యులు గోవింద్, రాధిక తెలిపారు.

రాజాం సిటీ: స్థానిక పశువుల ఆస్పత్రి ఆవరణలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పెంపుడు జంతువుల వల్ల మనుషులకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఈ చర్యలు చేపడుతున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ బి.జయప్రకాష్ తెలిపారు. వ్యాక్సిన్ వేసిన జంతువులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సంబంధిత అధికారులను వెంటనే సంప్రదించాలని సూచించారు.

'జగనన్న సురక్ష'తో సత్వర సేవలు


రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరాలను పరిశీలిస్తున్న మండల పరిషత్ ప్రత్యేకాధికారి సుధాకర్‌రావు

రాజాం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను సత్వరమే అందించాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి బి.సుధాకర్‌రావు గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు పలు శాఖల అధికారులతో సమావేశమైన ఆయన గ్రామ పంచాయతీల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతున్న తీరుపై సమీక్షించారు. అర్హులైన వారికి పథకాలు అందేలా చూడడంతో పాటు జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువపత్రాలను అవసరమైన వారికి అందించాలని తెలిపారు. అంతకుముందు రాజయ్యపేటలో జరిగిన జగనన్న సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, తహసీల్దార్ ఎస్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంలా 'జగనన్న సురక్ష'

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని గ్రామగ్రామాన ఓ యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గురువారం పలువురి ఇంటి వద్దకే వచ్చి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా ఉచితంగా అందిస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: గంగన్నపాడులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


రామభద్రపురం: ధ్రువపత్రాలు అందిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ సింహాచలంనాయుడు


మెంటాడ: ధ్రువపత్రాలు అందుకున్న వారితో వైఎస్సార్ సీపీ నాయకులు


బొబ్బిలి: బాడంగి మండలం, లక్ష్మీపురంలో ధ్రువపత్రాల పంపిణీకి వేలిముద్రలు సేకరిస్తున్న వలంటీర్లు


రాజాం సిటీ: లబ్ధిదారులకు ధ్రువపత్రాల అందజేత


రాజాం: బొద్దాంలో ధ్రువీకరణపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు


బాడంగి: ఆనవరంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ రామారావు, తహసీల్దార్ రఫీజాన్


వంగర: కొప్పరలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

సంక్షిప్తంగా...

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు


వైద్య శిబిరం వద్ద అందుబాటులో ఉన్న మందులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మండలంలోని గంగన్నపాడు గ్రామంలో జగనన్న సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఎంతమందికి వైద్య పరీక్షలు చేశారని, ఎంతమేర మందులు పంపిణీ చేశారని ఏఎన్ఎం వెంకటిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందుల నిల్వలు ఉంచాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌డీటీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో పంటలకు ఎంతో మేలు

రాజాం సిటీ: విత్తనశుద్ధితో పంటలకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ బి.నాగమణి తెలిపారు. గురువారం మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలో బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా గత పంటల అవశేషాలు తొలగించవచ్చన్నారు. అలాగే నేల నుంచి వచ్చే తెగుళ్లు పంటకు రాకుండా చేస్తుందన్నారు. రైతులంతా విత్తనశుద్ధి చేసుకుని, వచ్చే పంట లబ్ధిని పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎ.నారాయణమ్మ, రైతులు పాల్గొన్నారు.

గోధుమ పిండి పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు కిలో గోధుమ పిండి చొప్పున గురువారం పంపిణీ చేశారు. దాదాపు 14,400 మందికి వీటిని అందజేసినట్లు సివిల్ సప్లయి డీటీ ఆర్.సాయికృష్ణ తెలిపారు.

ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు

వంగర: ఉద్యోగులకు ప్రజలకు చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండలంలోని కొప్పర గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా సేవలందించి, తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లిన డిజిటల్ అసిస్టెంట్ కవితను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ఐజాక్, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాథ్, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం.విజయలక్ష్మి, సర్పంచ్ జి. నారాయుడు, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, పంచాయితీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.